


# ఫిలాన్‌త్రఫిస్ట్

జి. తులసీరాం

**జస్వంత్ స్వరూప్ గదిలోకి ఠీవిగా నడుచుకుంటూ వెళ్ళాడు. అతను ఆజానుబాహుడు. జస్వంత్ సూటు, బూటులో తన హోదాకు తగ్గట్లు ఎప్పటిలా హుందాగా ఉన్నాడు. అతను మల్టీమిలియన్ 'శాంతి స్వరూప్ రబ్బర్ కంపెనీ'కి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. స్వరూప్ అర్జెంటుగా రమ్మని కబురుపెడితే వెళ్ళాడు.**

జస్వంత్ గదిలోకి ప్రవేశించగానే స్వరూప్ ఏదో పత్రిక తిరగేస్తూ కనబడ్డాడు. స్వరూప్ తెల్లటి ఖద్దర్ దుస్తుల్లో నిరాడంబరంగా ఉన్నాడు. జస్వంత్ ఆ బట్టల్లో తప్పితే మరే దుస్తుల్లోనూ స్వరూప్‌ని చూసినట్లు జ్ఞాపకం లేదు.

జస్వంత్ స్వరూప్ ముందు నిలబడి విష్ చేశాడు. స్వరూప్ జస్వంత్‌ని కూర్చోమన్నట్లు చేత్తో సంజ్ఞచేస్తూ అన్నాడు. ''మీతో చాలా ముఖ్యమైన విషయం మాట్లాడుదామని రమ్మన్నాను!''

జస్వంత్ ఆ విషయమేమిటో చెప్పమన్నట్లు తలాడించాడు.

''నా వయస్సు పైబడుతోంది. మీకు తెలుసుకదా నాకు వారసులంటూ ఎవరూ లేరు. నా చేతుల్తో ఈ కంపెనీకి జీవంపోసి ఇంతదాన్ని చేశాను. ఈ

కంపెనీ కోసం నా శాయశక్తులూ ధారపోశాను. ఇకపై ఈ కంపెనీని ఒక నమ్మకస్తుని చేతిలో పెట్టి విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాను. దానికి మీరేమంటారు?''

స్వరూప్ రిటైర్ అవ్వాలనుకుంటున్నారని కంపెనీలో చాలారోజుల నుంచి చెప్పుకుంటున్నారు. అతను పెళ్ళి చేసుకోకపోవడంతో వారసులెవ్వరూ లేరు. కనుక స్వరూప్ కంపెనీ యాజమాన్యం జస్వంత్ చేతిలోకి వస్తుందని అందరూ అనుకుంటున్నారు. స్వరూప్ రిటైర్‌మెంట్ గూర్చి ఎప్పుడూ మాట్లాడకపోవడంతో జస్వంత్ అది పుకారు అనుకున్నాడు. రిటైర్‌మెంట్ పుకారు కాదు నిజమేనని ఇప్పుడు తెలిసింది.

''ప్రస్తుతం మీకు విశ్రాంతి చాలా అవసరం'' క్లుప్తంగా అన్నాడు జస్వంత్.

''ఈ కంపెనీని మన హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ ప్రేమ్‌జిత్ చేతుల్లో పెట్టాలనుకుంటున్నాను!''

జస్వంత్‌పై పిడుగు పడినట్లయింది. అతని చేతుల్లోకి వస్తుందనుకున్న కంపెనీ మరెవరి వశమో అవుతోంది! జస్వంత్ మౌనంగా ఉండడంతో స్వరూప్ అన్నాడు – ''మీరు ఈ కంపెనీలో ఇరవై ఏళ్ళుగా పనిచేస్తున్నారు. కాబట్టి నేనో నిర్ణయం తీసుకునే ముందు మీ అభిప్రాయమేమిటో తెలుసుకోవడం సమంజసం! చెప్పండి... ప్రేమ్‌జిత్‌కి ఈ కంపెనీ బరువు బాధ్యతలు అప్పగించాలనుకుంటున్నాను. మీకు ఇష్టమేనా?''

జస్వంత్ షాక్‌లో ఉన్నాడు. తార్కికంగా ఆలోచించే స్థితిలో లేడు. ''ప్రేమ్‌జిత్... చాలా మంచి కుర్రాడు. ప్రేమ్‌జిత్... యంగ్, డైనమిక్, ఇంటలిజెంట్, బ్రేవ్! చాలా మంచి నిర్ణయం తీసుకున్నారు. కంపెనీని అతని చేతుల్లో పెట్టడమే అన్నివిధాలా శ్రేయస్కరం.''

***

జస్వంత్ చెస్ బోర్డుపై పావును కదుపుతూ ''ఇన్ని సంవత్సరాలు ఆ కంపెనీలో గాడిదలా చాకిరీ చేస్తే ఇప్పుడు జరిగినదేమిటి? నాకు మిగిలినదేమిటి? ఎవరో ప్రేమ్‌జిత్ నిన్నకాక మొన్న వచ్చి గద్దలా కంపెనీని తన్నుకుపోతున్నాడు!'' అన్నాడు.

జస్వంత్ స్నేహితుడు ఉపేంద్ర ఆట ఎలా ఆడాలో ఆలోచిస్తూ ''నువ్వేదో నిజాయితీపరుడిలా మాట్లాడుతున్నావ్! స్వరూప్‌కి తెలియకుండా నువ్వు ఎన్ని లక్షలు దోచుకోలేదు!'' అన్నాడు.

జస్వంత్‌కి కోపమొచ్చింది. ''నేను ఆ లక్షలు తినకపోతే ఆ ముసలోడు ఏ అనాథ శరణాలయానికో దానం చేసేవాడు. ఆ కంపెనీ ఎట్టి పరిస్థితిలోనూ ఆ ప్రేమ్‌జిత్ వశమవ్వడానికి వీల్లేదు! ఏదో ఒక్కటి చెయ్యాలి.''

''ఏం చేయబోతున్నావు?'' ఉత్కంఠతని కనబడనివ్వకుండా అడిగాడు ఉపేంద్ర.

''నా ప్లాన్ సక్సెస్ కావాలంటే స్వరూప్ బర్త్‌డే పార్టీ ఘనంగా జరపాలి!''.

ఉపేంద్ర నవ్వాడు. ''చేతికి వాచీ కూడా కట్టుకోని ఆ మహానుభావుడు బర్త్‌డే పార్టీకి ఒప్పుకుంటాడా?''

జస్వంత్ గుర్రంతో ఉపేంద్ర రాణిని చంపుతూ అన్నాడు – ''అతడిని ఒప్పిస్తాను. ఒప్పించగలనన్న నమ్మకం నాకుంది.''

ఉపేంద్ర రాణి పోయినందుకు బాధపడుతూ ''సరే... స్వరూప్ పార్టీకి ఒప్పుకున్నాడనే అనుకుందాం. పార్టీలో ఏం చేస్తావు?'' అనడిగాడు. జస్వంత్ గుర్రం నుంచి తన రాజుని రక్షించుకోవడానికి దాన్ని పక్కకి జరిపాడు ఉపేంద్ర.

''కొన్ని విషయాలు చెప్పకపోవడమే మంచిది. అన్నట్టు నీ వద్ద ఆ రసమయి ఫోన్ నెంబరు వుందా?''

ఉపేంద్ర ఫోన్ నెంబరు చెప్పాడు.

జస్వంత్ ఏనుగు తీసుకొచ్చి ఉపేంద్ర రాజు పక్కన పెడుతూ – ''చెక్ అండ్ మేట్'' అన్నాడు.

***

మిడిల్ ఫైనాన్స్ మేనేజర్ అమృత్ స్వరూప్ గదిలోకి వేగంగా దూసుకొచ్చాడు.

''అమృత్ చాలా తొందరలో ఉన్నట్లున్నావు? ఏంటి విషయం?'' స్వరూప్ అడిగాడు.

''మనం తీసుకున్న రా మెటీరియల్‌కి పేమెంట్ చెయ్యాలి సార్. ఈరోజే చివరితేదీ. రేపట్నుంచయితే వడ్డీ కట్టాల్సి వస్తుంది.''

''ఐ సీ'' అంటూ తలూపాడు స్వరూప్.

''ఇరవై లక్షలు పే చెయ్యాలి సార్'' అమృత్ అన్నాడు. అతను చాలా తొందరగా ఉన్నాడు. బ్యాంకు మూసే సమయం దగ్గరపడుతోంది.

స్వరూప్ చెక్‌బుక్ తీసి టేబుల్‌పై పెట్టాడు. చొక్కా జేబు నుంచి కలం తీసుకున్నాడు. అతను కళ్ళజోడు కోసం వెతుక్కోసాగాడు.

అమృత్, స్వరూప్ దేనికోసమో వెతకడం చూసి ''ఏమి కావాలి సార్?'' అనడిగాడు.

''నా కళ్ళజోడు! నిన్నటి నుంచి కనబడ్డం లేదు. ఎక్కడ పెట్టానో ఏమిటో! ఇలా వెతుకుతూ పోతే నీకు ఆలస్యమయ్యేటట్లు ఉంది'' అని స్వరూప్ చెక్‌బుక్‌పై 2,00,00,000 అని రాసి సంతకం పెట్టాడు.

అమృత్ ఆ చెక్‌ని తీసుకొని హడావిడిగా వెళ్ళిపోయాడు.

స్వరూప్ కాసేపాగి టేబుల్ డ్రాయర్ నుంచి కళ్ళజోడు బయటికి తీసి పెట్టుకున్నాడు.

***

ఆరోజు స్వరూప్ పుట్టినరోజు. అతని ఇంట్లో పార్టీ అరేంజ్ చేయబడ్డది. పార్టీకి కంపెనీ ఉద్యోగులు, కార్మికులు వాళ్ళ కుటుంబాలను ఆహ్వానించారు. ఎక్కడ చూసినా పిల్లలతో, అమ్మాయిలతో ఇల్లంతా కళకళలాడుతోంది. స్వరూప్ పిల్లలందరినీ పలకరిస్తూ వాళ్లతో ఆటలాడుతూ మళ్లీ పిల్లాడైపోయాడు. మల్టీ మిలియన్ కంపెనీకి యజమానైన స్వరూప్ అలా పిల్లలతో ఆడుకోవడం అందరికీ ఆశ్చర్యంగానే వుంది.

రసమయి దూరంగా నిలబడి వున్న ప్రేమ్‌జిత్‌ని చూసి పలకరింపుగా నవ్వింది. రసమయిని ఒకసారి చూస్తే కళ్ళు పక్కకి తిప్పుకోవాలనిపించదు! అంతటి అందం ఆమెది! కలువలు విచ్చినట్లుండే కళ్ళు, చక్కటి చిన్ని ముక్కు, తాకితే కరిగిపోయేటట్లు ఉండే ఎర్రటి నునుపైన చెక్కిళ్ళు, అమృతం నిండినట్లుండే పెదాలు, కోల మొహం, తల కదిలించినప్పుడు దానితోపాటు నాట్యం చేసే చెవులు, ఆరోగ్యం, మృదుత్వం కలబోసినట్లున్న శరీరం, అందమైన చీరకట్టుతో మత్తెక్కించేటట్లు ఉంది రసమయి. ప్రేమ్‌జిత్ ఆమె మళ్ళీ ఎప్పుడు తన వంక చూస్తుందా అని ఎదురుచూస్తున్నాడు.

సేవకులు పిల్లలందరికీ కూల్‌డ్రింక్స్, చాక్లెట్స్ పంచిపెడుతున్నారు. స్వరూప్ పిల్లల దగ్గర చాక్లెట్ కావాలని మారాం చేస్తున్నాడు. వాళ్ళు ఇవ్వమంటున్నారు. కార్మికులంతా స్వరూప్‌ని ముచ్చటగా చూస్తున్నారు.

ప్రేమ్‌జిత్ రసమయి మళ్ళీ చూడకపోయేసరికి తీవ్రమైన వేదన అనుభవిస్తున్నాడు. అలాంటి వేదన కలగాలనే రసమయి అతన్ని చూడడం లేదు. ప్రేమ్‌జిత్‌కి చాలా అనీజీగా ఉంది. రసమయి చూపుకోసం పడిగాపులు కాస్తున్నాడు. ప్రేమ్‌జిత్ వద్దకు అమృత్



వెళ్ళి అతనితో మాటలు కలుపుతూ, 'కంగ్రాట్స్' అన్నాడు. ప్రేమ్‌జిత్ మొహం చిట్లించి ''ఎందుకు?'' అనడిగాడు.

''ఈ కంపెనీకి నువ్వు యజమాని కాబోతున్నావని అందరూ అనుకుంటున్నారు!''

ప్రేమ్‌జిత్ రసమయిని తప్ప ఇంకెవ్వరినీ పట్టించుకునే స్థితిలో లేడు.


''అవును... ఆ మాటలు నా చెవిన కూడా పడ్డాయి. అందులో ఎంత నిజముందో ఎవరికి తెలుసు? నౌ ఇఫ్ యు డౌంట్ మైండ్.. నాకు చాలా పనులున్నాయి'' అంటూ అమృత్‌ను వదిలి ప్రక్కకి తప్పుకున్నాడు ప్రేమ్‌జిత్.

జస్వంత్ ఓ సేవకుడికి 'ఇక నీ పని కానీ' అన్నట్లు సంజ్ఞ చేశాడు. అతను కూల్‌డ్రింక్ గ్లాసు ట్రేలో పెట్టుకుని సరాసరి ప్రేమ్‌జిత్ వద్దకు తీసుకెళ్ళాడు. ఆ కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలపబడి ఉంది.

ప్రేమ్‌జిత్ ఆ గ్లాసు అందుకొని కూల్‌డ్రింక్ సిప్ చేస్తూ రసమయిని చూడసాగాడు. అదే అనువైన సమయమనిపించి రసమయి ప్రేమ్‌జిత్‌ని చూసి మరో నవ్వు విసిరింది. దాంతో అతను తబ్బిబ్బైపోయాడు. రసమయి వచ్చి అతని పక్కన నిలబడింది. అతనికి పట్టలేని సంతోషంగా ఉంది. వాళ్ళిద్దరూ పక్కకెళ్ళి మాట్లాడుకోసాగారు.

స్వరూప్ కార్మికుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నాడు. అతని నిరాడంబరత, ఇతరుల పట్ల వున్న దయ, కళ్ళల్లో తొణికిసలాడే నిర్మలత్వం అందరినీ కట్టిపడేశాయి.

ప్రేమ్‌జిత్, రసమయి ఒకరి చేతిలో ఒకరు చేయి వేసి పార్టీ మధ్యలో అర్ధాంతరంగా వెళ్ళిపోవడం స్వరూప్ కళ్ళబడింది.




***

మరుసటిరోజు ఉదయం జస్వంత్ స్వరూప్ గదిలోకి పరుగులాంటి నడకతో వెళ్ళాడు.

జస్వంత్ హడావిడి, ఆత్రం చూసి స్వరూప్ అడిగాడు, ''ఏంటి అంత తొందరలో ఉన్నావు? ఏదైనా ఎమర్జన్సీ వచ్చిందా?''

''ఎమర్జన్సీనా? అని అంత మెల్లగా అంటారేంటి? కొంపలంటుకుపోతోంటే!''

''కొంపలంటుకునేంత ఎమర్జన్సీ ఏమొచ్చింది?'' స్వరూప్ అడిగాడు.

''ప్రేమ్‌జిత్ మంచివాడు, సుగుణ సంపన్నుడు అని ఈ కంపెనీకి అతన్ని యజమాని చేయాలనుకున్నారా? చూడండి.. అతని సుగుణాలేంటో!'' జస్వంత్ స్వరూప్‌కి కొన్ని ఫోటోలు అందిస్తూ అన్నాడు. అవి ప్రేమ్‌జిత్, రసమయిల ఫోటోలు.

స్వరూప్ వాటినంతా చూసి ''మన కంపెనీలో ఉన్న మేనేజర్స్, సూపర్‌వైజర్స్, వర్కర్స్ అందరినీ ఆడిటోరియంలో సమావేశపర్చండి. నేను తీసుకున్న ముఖ్యమైన నిర్ణయం గూర్చి ఈరోజే వాళ్ళకి వెల్లడి చేస్తాను'' అన్నాడు. జస్వంత్ సరేనని సంతోషంగా వెళ్ళిపోయాడు.

కంపెనీ ఉద్యోగస్తులంతా ఆడిటోరియంలో కూర్చుని స్వరూప్ రాకకోసం ఎదురుచూస్తున్నారు. 'అతను ఏమి చెప్పబోతున్నాడో?' అన్న కుతూహలం వారి ముఖ కవళికల్లో కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

స్వరూప్ వచ్చాడు. మైకందుకుని చెప్పసాగాడు –

''ఒక పారిశ్రామికవేత్త వద్ద ఒక కాంట్రాక్టరు చాలాకాలంగా పనిచేసేవాడు. ఒకరోజు పారిశ్రామికవేత్త కాంట్రాక్టర్‌ను పిలిచి 'నాకోసం నువ్వో ఇల్లు కట్టాలి. నీ తెలివి, నాణ్యమైన సామగ్రి ఉపయోగించి అద్భుతంగా కట్టాలి. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. ఇదే నా ఆఖరి కోరిక కాబట్టి నువ్వు చాలా శ్రద్ధతో ఈ పని చెయ్యాలి'' అంటాడు.

ఆ కాంట్రాక్టరు ఎన్నో తప్పుడు పనులు చేసి డబ్బులు కాజేస్తూ శ్రేష్ఠత, నాణ్యం లేని ఇల్లు కడతాడు.

పారిశ్రామికవేత్త ఆ ఇంటిని చూసి 'శభాష్! చాలా అందంగా ఇల్లు కట్టావు. ఇన్ని రోజులు నువ్వు నా వద్ద పనిచేసినందుకు ఈ ఇల్లు నీకు బహుమానంగా ఇస్తున్నాను'' అంటాడు.

'లివింగ్ విత్ ఆనర్' పుస్తకంలోని ఈ కథ మనిషి నిజాయితీగా బతకడం ఎంత ముఖ్యమో తెలుపుతుంది.

నేను ఈ కంపెనీ ప్రేమ్‌జిత్‌కి అప్పగిస్తున్నానని జస్వంత్‌తో చెప్పాను. అతనికి ఈ కంపెనీ ప్రేమ్‌జిత్ వశమవ్వడం ఇష్టంలేదు. కంపెనీని ఎలాగైనా చేజిక్కించుకోవాలని నా బర్త్‌డే పార్టీ అరేంజ్ చేశాడు. ఆ పార్టీలో ప్రేమ్‌జిత్ చేత మత్తుమందు కలిపిన కూల్‌డ్రింక్ తాగించాడు. రసమయి అనే హైక్లాస్ వేశ్యను ప్రేమ్‌జిత్ వద్దకు పంపి వారి ఫోటోలు తీసి నాకు చూపించాడు. పాపం నాకిదంతా తెలియదనుకున్నాడు. ఎన్నో ఏండ్లు ఈ కంపెనీలో పనిచేసిన జస్వంత్‌కి, ఈ కంపెనీ అప్పగించక కొత్తగా వచ్చిన ప్రేమ్‌జిత్‌కి అప్పగిస్తానన్నాను. దాంతో జస్వంత్ ఈ పని చేశాడు. అతని స్థానంలో నేనున్నా అదే పని చేసేవాడిని! ఇలాంటిదేదో జరుగుతుందనే నేను జస్వంత్‌కి అబద్ధం చెప్పాను! ఈ కంపెనీకి కాబోయే యజమాని ప్రేమ్‌జిత్ కాదు!''

స్వరూప్ మాటలు వింటున్న కార్మికులందరూ షాకయ్యారు. కంపెనీకి కాబోయే యజమాని ఎవరో తెలుసుకోవాలన్న ఉత్కంఠత వారిలో ఎక్కువయ్యింది. అదేమీ పట్టించుకోకుండా స్వరూప్ చెప్పసాగాడు – ''ఇన్నాళ్ళు ఈ కంపెనీకి అపార సేవ చేసినందుకు జస్వంత్‌కి నా ఆస్తిలో పది శాతం ఇవ్వదలచుకున్నాను! ఈ కంపెనీ అతని చేతుల్లో పెట్టనందుకు నన్ను క్షమించమని మనసారా కోరుకుంటున్నాను!! నా ఆస్తిలో యాభైశాతం అనాథ శరణాలయానికి, మిగిలిన నలభై శాతం ఈ కంపెనీలో పనిచేసే ఉద్యోగస్థుల పిల్లల స్కూళ్ళు, ఆరోగ్యం, స్కాలర్‌షిప్స్ మొదలగువాటికి ఉపయోగపడేట్లు విల్లు వ్రాయదల్చుకున్నాను!!!''

ఆడిటోరియమంతా చప్పట్లతో దద్దరిల్లిపోయింది. జస్వంత్ కూడా చప్పట్లు కొట్టసాగాడు. అక్కడ నిశ్శబ్దం నెలకొన్న తర్వాత స్వరూప్ చెప్పసాగాడు – ''మొన్న ఇరవై లక్షల రూపాయల చెక్కుపై నా సంతకం తీసుకోవడానికి ఒకతను నా వద్దకొచ్చాడు. నా కళ్ళజోడు ఎక్కడో మరచిపోయానని అతనితో చెప్పి ఇరవై లక్షల బదులు రెండు కోట్లకు చెక్కుపై సంతకం పెట్టిచ్చాను. అతను కావాలనుకొని వుంటే ఆ డబ్బు డ్రా చేసి పారిపోయి ఉండవచ్చు. కానీ అతనలా చేయలేదు. నేను పెట్టిన పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. అతన్నే ఈ కంపెనీకి ట్రస్టీగా నియమిస్తున్నాను! యజమానిగా కాదు ట్రస్టీగా!! అతనే అమృత్!!!''

***

అదేరోజు సాయంత్రం జస్వంత్ స్వరూప్ గదిలోకెళ్ళి మౌనంగా తలవంచుకుని నిలబడ్డాడు.

స్వరూప్ అతన్ని చూస్తూ ''ఏంటి జస్వంత్ ఇలా వచ్చారు? ఇంకా ఇంటికెళ్ళలేదా?'' అనడిగాడు.

''మీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలని ఉండిపోయాను సార్!''

''చెప్పండి''.

''నేను ఈ కంపెనీలో పనిచేసిన ఇరవై సంవత్సరాల్లో మీకు తెలియకుండా చాలా డబ్బు తిన్నాను సార్. కంపెనీ ప్రేమ్‌జిత్‌కి దక్కకూడదని, నాకు దక్కాలని ఎత్తులు పన్నాను. అది తెలిసి కూడా నాకు పది శాతం ఆస్తి వ్రాసిస్తానన్నారు. అందరి ముందు క్షమించమని కోరారు! మీరు చాలా గొప్పవారు! నేను తప్పు చేశాను. మీరే నన్ను క్షమించాలి సార్.. మీరే నన్ను క్షమించాలి!''

జస్వంత్ కళ్ళల్లో నీళ్ల సుడులు తిరగడం స్వరూప్ చూసి చిరునవ్వుతో అన్నాడు – ''నువ్వు నాకు తెలియకుండా డబ్బు కాజేశావని నాకు తెలిసింది. నీలో మార్పు తీసుకురావాలనే నేనిదంతా చేశాను. నేననుకొన్నది సాధించినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఇకపై నువ్వే ఈ కంపెనీకి ట్రస్టీ! అమృత్ నీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్!!''

★